ఎస్ఎన్‌డీపీ పనులు వేగంగా పూర్తి చేయండి

ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



ఎస్ఎన్‌డీపీ అధికారులతో సమావేశమైన ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎల్‌బీనగర్: నియోజకవర్గంలో జరుగుతున్న ఎస్ఎన్‌డీపీ పనులను వేగవంతంతగా పూర్తి చేయాలని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి కోరారు. ఎస్ఎన్‌డీపీ పనులపై గురువారం ఎమ్మెల్యే అధికారుతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఎస్ఎన్‌డీపీ పనుల కోసం గతంలో రూ.193 కోట్లు మంజూరు చేయగా, ఎస్ఎన్‌డీపీ ఫేజ్– 2 పనుల్లో భాగంగా మరికొన్ని తీవ్రమైన సమస్యలు గుర్తించి మరో రూ.23 కోట్లు మంజూరు చేశారని తెలిపారు. కొన్నిచోట్ల స్థానిక నాయకులు అధికారులను వేధిస్తూ పనులు ముందుకు సాగకుండా చేస్తున్నారని, పనులు పూర్తి కాకపోతే వర్షా కాలంలో ఇళ్లలోకి నీరు వస్తే ఆ నెపాన్ని ఎమ్మెల్యేపై నెట్టి వేయాలనుకొనే ధోరణి మార్చుకోవాలని హితవు పలికారు. ఎస్ఎన్‌డీపీ పనులు పూర్తైతే నియోజకవర్గంలో పూర్తి స్థాయిలో వరద ముంపు సమస్య పరిష్కారమవుతుందని అన్నారు. పనులు జరగాకుండా ఎవరైన అధికారులను అడ్డుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో అధికారులు కృష్ణ, కార్తీక్, హేమునాయక్, కిరణ్, రఫీ, నాయకులు సత్యం చారి, శ్రీనివాస్, రోహిత్‌రెడ్డి పాల్గొన్నారు.

కలసి కట్టుగా కాలక్షేపం!

- తలో చేయి వేసి 'సీనియర్ సిటిజెన్స్' భవన నిర్మాణం
- పేపర్లు చదువుతూ.. క్యారమ్స్ ఆడుతూ...
- సేద తీరుతున్న రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగులు



సచివాలయనగర్‌లోని సీనియర్ సిటిజెన్స్ ఫోరం భవనం

వనస్థలిపురం: వారంతా విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగులు... విధి నిర్వహణలో అలసి సొలసిన వారు వృద్ధాప్యంలో కాసింత కాలక్షేపం చేసేందుకు సంఘటితమయ్యారు. అనుకున్నదే తడవుగా తలా ఒక చేయి వేసుకొని, ప్రజా ప్రతినిధుల సహకారంతో వనస్థలిపురం సచివాలయ నగర్‌లో ఓ అందమైన భవనం నిర్మించుకున్నారు. 'సీనియర్ సిటిజెన్స్ ఫోరం'గా ఏర్పడి ఆ భవనంలో కాలక్షేపం చేస్తూ సేద దీరుతున్నారు.

2003లో భవన నిర్మాణం...

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సచివాలయంలో పనిచేస్తున్న ఉద్యోగులకు 1983లో అప్పటి ప్రభుత్వం 'సెక్రెటేరియేట్ ఎంప్లాయీస్ హౌసింగ్ సొసైటీ' పేరున వనస్థలిపురంలో ఇళ్ల స్థలాలు కేటాయించింది. హుడా ఆధ్వర్యంలో 840 ఇళ్లు నిర్మించుకొని దానికి సచివాలయనగర్‌గా నామకరణం చేసుకున్నారు. ఉద్యోగుల్లో కొందరు రిటైర్ కావడంతో సచివాలయనగర్ బస్టాపు వద్ద చెట్ల కింద ఉన్న అరుగులపై కాలక్షేపం చేస్తూ సేద తీరేవారు. అనంతరం వారు తాము కాలక్షేపం చేసేందుకు అనువుగా పక్కా భవనం సమకూర్చుకోవాలని సంకల్పించారు. అప్పటి ఎంపీ గుత్తా సుఖేందర్‌రెడ్డిని కలిసి తమ భవనానికి ఆర్థిక సాయం అందించాలని కోరారు. ఆయన ఎంపీ ఫండ్ నుంచి రూ. 8 లక్షలు కేటాయించడంతో సొసైటీకి చెందిన స్థలంలో 2003లో ఓ భవనాన్ని నిర్మించుకున్నారు. దానికి 'సీనియర్ సిటిజెన్స్ ఫోరం' భవనంగా నామకరణం చేసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి చొరవతో ఎల్‌బీనగర్ మున్సిపాలిటీ నుంచి మంజూరైన రూ. 10 లక్షల నిధులతో మరో అంతస్తు నిర్మించుకున్నారు. దాదాపు 150 మంది సీనియర్ సిటిజెన్స్ ఉదయం, సాయంత్రం వేళల్లో ఇక్కడికి వస్తుంటారు. క్యారమ్స్ ఆడుతూ దినపత్రికలు చదువుతూ సేద తీరుతుంటారు.

మా వంతు సమాజ సేవ చేస్తున్నాం..



ఫోరం ఆధ్వర్యంలో చర్చా వేదికలు, పెన్షనర్స్‌డే, ఇండిపెండెన్స్‌డే తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. సీనియర్ సిటిజెన్ల కోసం పలుమార్లు మెడికల్ క్యాంప్‌లు ఏర్పాటు చేశాం. సమాజ సేవ చేసేందుకు ఫోరం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుంది. ప్రతినెలా విద్యుత్ ఖర్చు, వార్తాపత్రికల ఖర్చు ఎక్కువగా అవుతోంది. పత్రికా యాజమాన్యాలు పెద్ద మనసు చేసుకొని మా ఫోరంకు ఉచితంగా పత్రికలు అందజేస్తే బాగుంటుంది.

– వీపీకే బసవయ్య, ఫోరం ప్రధాన కార్యదర్శి, సెక్రెటేరియట్ రిటైర్డు ఉద్యోగి



పత్రికలు చదువుతున్న సీనియర్ సిటిజెన్స్ (ఫైల్)



ఫోరం భవనంలో క్యారమ్స్ ఆడుతున్న రిటైర్డ్ ఉద్యోగులు

యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యం



యోగా శిక్షణ ఇస్తున్న ఇస్మాయిల్ గురూజీ

చంపాపేట: నిరంతర యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని గురు నిలయ ఫౌండర్, శ్రీస్వధర్మ యోగి ఇస్మాయిల్ గురూజీ అన్నారు. గురువారం చంపాపేట డివిజన్ సాయిరాంనగర్ కాలనీలోని లోటస్ ల్యాబ్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన యోగా కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. మోకాళ్ల, కీళ్ల, నడుం వంటి దీర్ఘకాలిక నొప్పులు ఉన్నవారు బౌద్ధ సన్యాసులు అందించిన ఫైడాలజిస్ అనే యోగా సాధనతో ఇట్టే నయం చేయవచ్చని అన్నారు. యోగా కేంద్రంలో ప్రతి రోజు ఉదయం, సాయంత్రం వేళల్లో యోగా శిక్షణా తరగతులు నిర్వహిస్తామని, దీర్ఘకాలిక నొప్పులతో బాధ పడేవారు క్రమం తప్పకుండా సాధనకు హాజరు కావాలని ఆయన సూచించారు. యోగా శిక్షకులు నరేందర్, ప్రభాకర్‌రెడ్డి, జయలక్ష్మి పాల్గొన్నారు.

ఐఎస్ సదన్ డివిజన్ సమగ్రాభివృద్ధికి కృషి



బాలాజీనగర్‌లోని సమస్యలు పరిశీలిస్తున్న జంగం మధుకర్‌రెడ్డి

సైదాబాద్: ప్రణాళికాబద్ధంగా ఐఎస్ సదన్ డివిజన్ సమగ్రాభివృద్ధికి కృషి చేస్తున్నామని బీజేపీ భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు జంగం మధుకర్‌రెడ్డి తెలిపారు. పలు కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధుల విజ్ఞప్తి మేరకు ఆయన గురువారం డివిజన్‌లోని బాలాజీనగర్, ఆదర్శనగర్, న్యూబాలాజీనగర్ కాలనీల్లో పాదయాత్ర చేస్తూ పర్యటించారు. ఆయా కాలనీల్లో పలు ప్రాంతాల్లో రహదారులు ఛిద్రమయ్యాయని, పారిశుద్ధ్య సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా మధుకర్‌రెడ్డి మాట్లాడుతూ, వెంటనే సంబంధిత అధికారులతో చర్చించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఆయా కాలనీల సంక్షేమ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని ఆక్రమించి నిర్మాణాలు



ఆదర్శ్ నగర్‌లో ప్రభుత్వ భూమిని కబ్జాచేసి నిర్మిస్తున్న అక్రమ కట్టడం

హస్తినాపురం: డివిజన్ పరిధిలోని నందనవనం కాలనీ ఆదర్శ్‌నగర్‌లోని ప్రభుత్వ భూమిని కబ్జా చేసి నిర్మాణాలు చేపడుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సరూర్‌నగర్ మండల రెవెన్యూ అధికారులు, ఎల్‌బీనగర్ సర్కిల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు కబ్జాదారుల నుంచి ముడుపులు తీసుకుని అటువైపు కన్నెత్తి చూడడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ భూమితో పాటు పేదలు నివసించే ప్రాంతంలో ఉన్న రోడ్డును సైతం ఆక్రమించుకుని నిర్మాణాలు చేపడుతున్నా అడ్డుకోవడం లేదని, వెంటనే ఉన్నతాధికారులు స్పందించి ప్రభుత్వ భూమిలో చేపడుతున్న నిర్మాణాలను అడ్డుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో అత్యున్నత విద్యా బోధన



పుస్తకాలు, దుస్తులు అందజేస్తున్న కార్పొరేటర్ అరుణాసురేందర్ యాదవ్

నాగోలు: ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా అత్యున్నతమైన విద్యా బోధన సాగుతోందని, విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని నాగోలు డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణాసురేందర్ యాదవ్ అన్నారు. నాగోలు ప్రభుత్వ పాఠశాలలో గురువారం నిర్వహించిన బడిబాట కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫారంలు అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన ఎంతోమంది ఉన్నత పదవుల్లో ఉన్నారని గుర్తు చేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలనే సంకల్పంతో ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు విద్యార్థులకు కావాల్సిన పాఠ్య పుస్తకాలు, యూనిఫారంలు అందిస్తోందన్నారు. ప్రధానోపాధ్యాయులు లక్ష్మీదేవి, పీటర్, దినేష్, నాయకులు కేశిరెడ్డి పద్మారెడ్డి, రావుల శ్రీనివాస్ గౌడ్, నరేందర్ రెడ్డి, మనోజ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



జితేందర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరుతున్న సయ్యద్ ఇస్మాయిల్

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్ ఎన్టీఆర్‌నగర్‌కు చెందిన కార్మిక నాయకుడు సయ్యద్ ఇస్మాయిల్ గురువారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు మిద్దెల జితేందర్ సయ్యద్ ఇస్మాయిల్‌కు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జితేందర్ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం పేద, బడుగు బలహీనవర్గాల అభివృద్ధి కోసం అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలను చేపడుతోందని, వాటిని ప్రజలకు వివరించి చైతన్యవంతులను చేయాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ, సేవాదళ్ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని పార్టీలో చేరిన సయ్యద్ ఇస్మాయిల్ అన్నారు.

రోడ్లపై చెత్తను వేస్తే చర్యలు: దర్పల్లి



కాలనీల్లోని రోడ్లపై చెత్తను సుభ్రం చేస్తున్న జీహెచ్ఎంసీ సిబ్బంది

లింగోజిగూడ: రోడ్లపై చెత్తను వేస్తే చర్యలు తప్పవని, ప్రతి ఒక్కరూ చెత్తను ఆటోల్లోనే వేయాలని లింగోజిగూడ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. డివిజన్‌లోని పలు కాలనీల్లో రోడ్ల పక్కన చెత్త పేరుకుపోవడాన్ని గమనించిన ఆయన ఆయన జీహెచ్ఎంసీ సిబ్బందిని పిలిపించి శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, డివిజన్‌ను ఆదర్శవంతంగా తీర్చి దిద్దడమే తన లక్ష్యమని, ఎక్కడా చెత్త లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఎక్కడ పడితే అక్కడ చెత్తను వేయడం వల్ల దోమలు, ఈగలు విజృంభించి జనం రోగాల బారిన పడుతున్నారన్నారు. ప్రజల భాగస్వామ్యంతోనే ఏదైనా సాధ్యమవుతుందని, పరిసరాల పరిశుభ్రతలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

రైతుబజార్లలో కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/ వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు (కిలో... రూపాయల్లో)... టమాటా 41, వంకాయ 23, బెండ 50, పచ్చిమిర్చి 65, కాకర 45, బీర 65, క్యాబేజీ 21, ఫ్రెంచి బీన్స్ 115, క్యారెట్ 40, దొండ 26–28, చిక్కుడు 45, గోకర 45, బీట్‌రూట్ 23, క్యాప్సికం 60, ఆలు 35, దోస 25, సొర 13, పొట్ల 18, ఉల్లిగడ్డ 39, చామగడ్డ 40. శుక్రవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే ఈ ధరలు అమలులో ఉంటాయి.


21 నుంచి చంద్రమౌళేశ్వర ఆలయ వార్షికోత్సవాలు

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్ అలకాపురిలోని శ్రీ శృంగేరి శంకర మఠంలోని శారదా చంద్రమౌళేశ్వరస్వామి ఆలయ సప్తాదశ వార్షికోత్సవాలు ఈ నెల 21 నుంచి 23వ తేదీ వరకు ఘనంగా నిర్వహిస్తామని శృంగేరి శంకర మఠ బ్రాంచ్ అధికారి కొవ్వడి శ్రీనివాస్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. వార్షికోత్సవాల సందర్భంగా ఆలయంలో మహాకాళి అలంకరణ, చండీ పారాయణం, సామూహిక కుంకుమార్చన వంటి ప్రత్యేక పూజలు జరగుతాయన్నారు.

నిమిషాంబదేవి 18వ వార్షిక బ్రహ్మోత్సవాలు

బోడుప్పల్: పెంటారెడ్డి కాలనీలోని శ్రీమాతా నిమిషాంబదేవి అష్టాదశ 18వ వార్షిక బ్రహ్మోత్సవాలను ఈ నెల 16వ తేదీన నుంచి వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు వెల్లడించారు. 16న దేవతా ప్రార్థన, గోపూజ, శాంతి మంత్ర పఠనం, విఘ్నేశ్వర పూజ, యాగశాల ప్రవేశం, అంకురార్పణ, ప్రధాన దేవతా కలశ స్థాపన, సామూహిక చండీ హోమం, అమ్మవారికి బంగారు చీరె అలంకరణ, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. 17వ తేదీన శ్రీచక్రార్చన, నక్షత్ర నవగ్రహ పాశుపత హోమం, నరదృష్టి నివారణకు శక్తి హోమం, మహాలక్ష్మి అనుగ్రహనార్థం హోమం, 18వ తేదీన గణపతి, శివాలయం, శ్రీరామపరివార, ఆంజనేయ దత్తాత్రేయ, సాయిబాబా, నవగ్రహ, నాగదేవత, పూర్ణాహుతి, అమ్మవారికి పంచామృత, 56 రకాల పండ్ల రసాలతో సుగంధ ద్రవ్యాలతో నిజాభిషేకం, అమ్మవారికి పల్లకీ సేవ ఊరేగింపు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు



హుడాకాంప్లెక్స్: మరమ్మతుల కారణంగా శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సరూర్‌నగర్ డివిజినల్ ఇంజినీర్ కెకె రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ సిరీస్, ఎల్‌బీనగర్ ఫీడర్ల పరిధిలోని కాలనీలలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపేయనున్నట్లు పేర్కొన్నారు.

ఎన్ఐఐఎంహెచ్‌కు ప్రపంచ ఆరోగ్య సంస్థ గుర్తింపు



సైదాబాద్‌లోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ మెడికల్ హెరిటేజ్ సంస్థ కార్యాలయం

సైదాబాద్: సైదాబాద్ డివిజన్ రెవెన్యూబోర్డ్ కాలనీలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ మెడికల్ హెరిటేజ్ (ఎన్ఐఐఎంహెచ్) సంస్థను వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ (డబ్ల్యూహెచ్ఓ) సాంప్రదాయ వైద్య పరిశోధనల కోసం తమ సహకార కేంద్రంగా గుర్తించింది. సెంట్రల్ కౌన్సిల్ ఫర్ రీసెర్చ్ ఇన్ ఆయుర్వేద సైన్సెస్ (సీసీఆర్ఏఎస్)కు చెందిన తమ సంస్థను సాంప్రదాయ వైద్యంలో మౌలిక, సాహిత్య పరిశోధన కోసం సీసీ ఐఎన్‌డీ–177 సహకార కేంద్రంగా డబ్ల్యూహెచ్ గుర్తించిందని ఎన్ఐఐఎంహెచ్ ఇన్‌చార్జ్ అసిస్టెంట్ డైరెక్టర్ గోలిపెంచల ప్రసాద్ తెలిపారు. జూన్ 2024 నుంచి నాలుగేళ్ల పాటు ఈ గుర్తింపు కొనసాగుతుందన్నారు. సంస్థ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, 1956లో స్థాపించబడ్డ తమ సంస్థ ఆయుర్వేదం, యోగా, నేచురోపతి, సిద్ధ, సోవా-రిగ్పా, యునాని, హోమియోపతి, బయోమెడిసిన్ విభాగాల్లోనే కాకుండా భారతదేశంలోని ఇతర ఆరోగ్య సంరక్షణ విభాగాలలో వైద్య, చారిత్రక పరిశోధనలను డాక్యుమెంట్ చేయడానికి, ప్రదర్శించడానికి ఒక ప్రత్యేక గుర్తింపు పొందిందన్నారు. సీసీఆర్ఏఎస్ డైరెక్టర్ జనరల్, ఎన్ఐఐఎంహెచ్, డబ్ల్యూహెచ్ఓ సీసీ హెడ్ ప్రొఫెసర్ వైద్య రబీనారాయణ ఆచార్య నిరంతర కృషితో తమ సంస్థ ఈ మైలురాయికి చేరుకుందన్నారు.

కేంద్ర మంత్రులకు బీజేపీ నేతల శుభాకాంక్షలు



కిషన్ రెడ్డిని సన్మానిస్తున్న కొప్పుల దినేష్

మలక్‌పేట: మలక్‌పేట బీజేపీ నేతలు గురువారం ఢిల్లీకి తరలి వెళ్లారు. కేంద్ర మంత్రులుగా ఇటీవల ప్రమాణ స్వీకారం చేసిన జి.కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లు గురువారం పదవీ బాధ్యతలు తీసుకున్నారు. ఈ కార్యక్రమానికి మలక్‌పేట నుంచి వెళ్లిన పలువురు బీజేపీనేతలు ఢిల్లీ వెళ్లి కేంద్ర మంత్రులను ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. మంత్రులను సన్మానించిన వారిలో మూసారంబాగ్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు కొప్పుల దినేష్, సీనియర్ నాయకులు బొక్క మధుసూదన్ రెడ్డి, నవీన్ రెడ్డి తదితరులు మంత్రులను సన్మానించిన వారిలో ఉన్నారు.

'తీగల'ను సత్కరించిన కార్పొరేటర్



సైదాబాద్: డివిజన్ పరిధిలోని తిరుమల హిల్స్ కాలనీ సంక్షేమ సంఘం నూతన అధ్యక్షుడిగా ఇటీవల మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి ఎన్నికయ్యారు. గురువారం జీహెచ్ఎంసీ అధికారులు, కాలనీవాసులతో కలిసి సైదాబాద్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ తిరుమల హిల్స్‌లో పాదయాత్ర చేస్తూ సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు కాలనీలోని తీగల కృష్ణారెడ్డి నివాసానికి వెళ్లి మర్యాద పూర్వకంగా కలిశారు. కార్పొరేటర్ అరుణ, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొత్తకాపు రవీందర్‌రెడ్డిలు తీగలను శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. తిరుమల హిల్స్ కాలనీ సమగ్రాభివృద్ధికి సమన్వయంతో కృషి చేద్దామని వారు అన్నారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు నర్సింహారెడ్డి, అర్జున్‌రెడ్డి, శ్రీనాథ్ పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యనందించాలి



పాఠ్యపుస్తకాలు, యూనిఫారాలు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ నర్సింహారెడ్డి

మన్సూరాబాద్: కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించాలని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. మన్సూరాబాద్ చౌరస్తా సమీపంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసిన పాఠ్యపుస్తకాలు, యూనిఫారాలను గురువారం ఆయన పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని ఉపాధ్యాయులను కోరారు. పాఠశాల ప్రహరీ కూలిన విషయాన్ని కలెక్టర్, డీఈఓల దృష్టికి తీసుకెళ్లానని తెలిపారు. పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటానని అన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు సరిత, ఉపాధ్యాయులు శ్రీనివాస్, సరిత, నాయకులు పాతూరి శ్రీధర్‌గౌడ్, హరీష్‌రెడ్డి, నాంపల్లి మహేందర్, భీమనపల్లి సిద్దు పాల్గొన్నారు.

పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి


మహేశ్వరం: పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేస్తానని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు అమనగంటి ప్రశాంత్ రెడ్డి పేర్కొన్నారు.గురువారం మండల పరిధిలోని తుమ్మలూరు గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో బీఈడీ చదివిన ప్రైవేట్ ఉపాధ్యాయురాలిని నియమించి తన సొంత నిధులతో రెండు నెలల వేతనం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులు లేరని తన దృష్టికి రావడంతో తన సొంత నిధులు వెచ్చించి టీచర్‌ను నియమించి వేతనం ఇస్తున్నామన్నారు. భవిష్యత్‌లో మరింత సహకారం అందిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మహేందర్‌రెడ్డి, కొండల్‌రెడ్డి పాల్గొన్నారు.

డ్రగ్స్‌కు దూరంగా ఉండండి

అదనపు డీసీపీ సత్యనారాయణ

పహాడీషరీఫ్: విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటూ బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని మహేశ్వరం జోన్ అదనపు డీసీపీ సత్యనారాయణ పేర్కొన్నారు. గురువారం బాలాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓయస్ డిగ్రీ కళాశాలలో డ్రగ్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి అదనపు డీసీపీ సత్యనారాయణ, ఏసీపీ లక్ష్మీకాంత రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. మత్తు పదార్థాలకు అలవాటు పడితే జీవితాలు దుర్భరంగా మారుతాయన్నారు. మత్తులో మనిషి విచక్షణ కోల్పోతారన్నారు. క్రమశిక్షణతో విద్యనభ్యసించి జీవితంలో ఉన్నతంగా ఎదగాలన్నారు. ప్రతిఒక్కరూ సైబర్‌క్రైం పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బాలాపూర్ ఇన్‌స్పెక్టర్ భూపతి తదితరులు పాల్గొన్నారు.

అనాథ విద్యార్థి గృహానికి నేషనల్ సేవా ధార్మిక్ అవార్డు



మార్గం రాజేష్‌కు అవార్డు అందజేస్తున్న ఏపీ మాజీ ఎమ్మెల్సీ జూపూడి ప్రభాకర్‌రావు

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్ చిత్రలేవుట్ కాలనీలోని అనాథ విద్యార్థి గృహానికి ప్రఖ్యాత లతా రాజా ఫౌండేషన్ నేషనల్ సేవా ధార్మిక్ అవార్డును అందజేసింది. దేశంలో బడుగు బలహీన వర్గాల వారికి, మానసిక, శారీరక వికలాంగులకు, అనాథ, నిరుపేదలకు చేస్తున్న సేవలకు గుర్తింపుగా నాలుగు సంస్థలకు నేషనల్ సేవా ధార్మిక్ అవార్డును ప్రకటించారు. అందులో భాగంగా గురువారం సంగారెడ్డి జిల్లా కేంద్రంలో జరిగిన ఓ కార్యక్రమంలో ఏపీ మాజీ ఎమ్మెల్సీ జూపూడి ప్రభాకర్ రావు, పారిశ్రామికవేత్త శ్రీనివాస్ రావు చేతుల మీదుగా అనాథ విద్యార్థి గృహం అధ్యక్షుడు మార్గం రాజేశ్‌కు నేషనల్ సేవా ధార్మిక్ అవార్డుతో పాటు రూ.లక్ష నగదు బహుమతి అందజేశారు. కార్యక్రమంలో లతా రాజా ఫౌండేషన్ చైర్మన్ కేకే రాజా తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ పేదోడికి సీపీఐ అండ

జాతీయ నేత పల్లా వెంకట్ రెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్: నగర శివారుల్లో వేలాది మంది పేదలకు ఇళ్ల స్థలాలు ఇప్పించే పోరాటం చేసి ఆసరాగా నిలిచిన ఘనమైన చరిత్ర సీపీఐదేనని ఆ పార్టీ జాతీయ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ పరిధి ఆర్కే నగర్‌లో గురువారం ఏర్పాటు చేసిన సీపీఐ ప్రజా బహిరంగ సభలో పాల్గొన్న ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశ రాజకీయాలు ప్రమాదంలో ఉన్నాయని ప్రజాస్వామ్యంలో ఓటును డబ్బు, మద్యం, లిక్కర్ మాఫియాతో పాటు మతం అనే మాధ్యం శాసిస్తున్నాయన్నారు. అత్యంత భయంకరమైన ఆయుధంగా మతాన్ని వాడుకుంటున్న బీజేపీ పాలన ఎక్కువ రోజులు కొనసాగదన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఈటి నరసింహ, కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్ర చారి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ముత్యాల యాదిరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు, కౌన్సిలర్ పబ్బతి లక్ష్మణ్, మాజీ కౌన్సిలర్ అజ్మీర్ హరిసింగ్ నాయక్, వేణుగోపాల చారి, మల్లయ్య గౌడ్ ఉప్పలయ్య, జమీల, భరత్, గోపి, పాపయ్య, శోభన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ ట్రాఫికింగ్‌పై అప్రమత్తంగా ఉండాలి



మనుషుల అక్రమ రవాణాపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ దయాకర్‌రెడ్డి, ప్రజ్వల సంస్థ నిర్వాకులు

నాగోలు: నేటి సమాజంలో కొత్త పద్ధతుల ద్వారా సైబర్ ట్రాఫికింగ్ జరుగుతున్నదని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎల్‌బీనగర్ ఎస్ఐ దయాకర్‌రెడ్డి సూచించారు. రాచకొండ పోలీస్ కమిషనరేట్, ప్రజ్వల సంస్థ (ఎన్‌స్తో) ఆధ్వర్యంలో గురువారం రాత్రి ఎల్‌బీనగర్ చౌరస్తాలో ఎల్‌బీనగర్ సీఐ రామాంజనేయులు సహకారంలో సైబర్ ట్రాఫికింగ్, మనుషుల అక్రమ రవాణా, వ్యభిచారానికి వ్యతిరేకంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎల్‌బీనగర్ ఎస్ఐ దయాకర్‌రెడ్డి, ప్రజ్వల సీనియర్ ప్రాజెక్ట్ మేనేజర్ చంద్రయ్య, కో ఆర్డినేటర్ సురేష్‌కుమార్ మాట్లాడుతూ, నగరంలో నూతన పద్ధతుల్లో సైబర్ ట్రాఫికింగ్ జరుగుతోందని, మొబైల్ ఫోన్‌లో ఆన్‌లైన్ యాప్స్ వాడుతున్న వారెవరైనా దీనికి గురయ్యే ప్రమాదం ఉందన్నారు. అక్రమ రవాణా కు గురైన వారు శ్రమ, అవయవ, లైంగిక దోపి డీలకు గురవుతారన్నారు. సైబర్ నేరగాళ్లు రకరకాల యాప్స్ ద్వారా యువతులను లైంగికంగా మోసం చేస్తున్నారన్నారు. ప్రజ్వల సిబ్బంది సంజయ్, సాయికుమార్, అంబర్‌సింగ్, మిథిలిరాజ్ పాల్గొన్నారు.

రికవరీ చేసిన సెల్‌ఫోన్లు బాధితులకు అందజేత

కాచిగూడ: సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న బాధితుల నుంచి అందిన ఫిర్యాదుల మేరకు సీఎస్ఐఆర్ యాప్ ద్వారా 17 సెల్‌ఫోన్లు రికవరీ చేసి బాధితులకు కాచిగూడ ఇన్‌స్పెక్టర్ పి.లక్ష్మీకాంత్ రెడ్డి గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ... ఈస్ట్‌జోన్ డీసీపీ ఆదేశాల మేరకు సీఎస్ఐఆర్ యాప్ ద్వారా బాధితుల నుంచి వచ్చే ఫిర్యాదులతో సెల్‌ఫోన్లను గుర్తించి రికవరీ చేస్తున్నట్లు తెలిపారు. 100 డయల్ ద్వారా వచ్చే ఫిర్యాదులను తక్షణమే పరిష్కరిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితుల నుంచి ఫిర్యాదులను స్వీకరించి కేసులను త్వరితగతిన పరిష్కరించే విధంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రజల సహకారంతో ఫ్రెండ్లీ పోలీసింగ్‌ను సమర్థవంతంగా అమలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రజలు, పోలీసు సిబ్బంది, అందరి సహకారంతో కాచిగూడలో చట్టపరిధిలో సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో అడ్మిన్ ఎస్ఐ డి.సుభాష్, ఎస్ఐలు హెచ్.నరేష్, పి.రవికుమార్, క్రైం పోలీస్ సిబ్బంది శివ, అశోక్, శ్రీకాంత్, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.